నమస్తే తెలంగాణ
నిపుణ
Guide to Excellence
08.
www.nipuna.ntnews.com,
www.facebook.com/ntnipuna
nipuna
Every Wednesday Free Supplement
13 డిసెంబర్ 2023
పేజీలు 8

**శీతల్ మహాజన్**

భారతీయ స్కైడైవర్ పద్మశ్రీ గ్రహీత శీతల్ మహాజన్ (41) నవంబర్ 15న స్కై డైవింగ్ చేసి రికార్డు నమోదు చేశారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన శిఖరం మౌంట్ ఎవరెస్ట్ ఎదుట హెలికాప్టర్ నుంచి ఆకాశంలో 21,500 అడుగుల ఎత్తులో స్కై డైవింగ్ చేశారు. అత్యంత ఎత్తులో కాలాపత్తర్ (17,444 అడుగులు/5,317 మీ.) వద్ద దిగారు. దీంతో ప్రపంచంలో అత్యంత ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేసిన మొదటి మహిళగా ఆమె రికార్డు సృష్టించారు.

## తెలంగాణ

### తెలంగాణ రైతులకు జాతీయ అవార్డు

- కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గుండి గోపాల్‌రావుపేటకు చెందిన ఆదర్శ రైతు ద్యావ రామచంద్రారెడ్డి జాతీయ ఉత్తమ మిలియనీర్ రైతు అవార్డుకు ఎంపికయ్యారు. ఈయనతో పాటు తెలంగాణ నుంచి మరో ముగ్గురు రైతులు ఎంపికయ్యారు. అందులో జమ్మికుంట కేవీకే ఫార్మర్ ఆర్సీ రెడ్డి కూడా ఉన్నారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి, కృషి జాగరణ్ సంయుక్తంగా ఏటా 'మిలీనియం ఫార్మర్స్ మీట్'లో ఉత్తమ రైతులకు అవార్డులను అందజేస్తుంది. రామచంద్రారెడ్డి జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్రం, ఉద్యాన శాస్త్రవేత్త వేణుగోపాల్ ప్రోత్సాహంతో బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్, మస్క్ మిలన్, లిచీ, ఉష్ణ యాపిల్, వరి తదితర పంటలు సాగు చేస్తున్నారు. దిగుబడులను 'ఆర్సీ రెడ్డి' బ్రాండుతో విక్రయిస్తున్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని ఆయనను జాతీయ ఉత్తమ రైతు అవార్డుకు ఎంపిక చేశారు. ఈ నెల 8న ఆర్సీ రెడ్డి అవార్డు అందుకున్నారు.

### హెచ్‌సీయూకు కొత్త పేటెంట్




- హైదరాబాద్ యూనివర్సిటీ మరో కొత్త పేటెంట్‌ను దక్కించుకున్నది. మొక్కల్లో వ్యాధి నిరోధకాలుగా వ్యవహరించే 'బౌమాన్-బిర్క్, కునిట్జ్' ఇన్హిబిటర్లను వేరుచేసి శుద్ధీకరించే విధానానికి ఈ పేటెంట్ లభించింది. స్కూల్ ఆఫ్ లైఫ్‌సైన్సెస్ శాస్త్రవేత్తలు ప్రొఫెసర్ కే పద్మశ్రీ, డాక్టర్ ఎంకే అరుణశ్రీ ఈ విధానాన్ని అభివృద్ధి చేశారు. వీరికి మరియమ్మ గుజ్జర్లపూడి, భారతి కొటార్యా సహకరించారు. మొక్కల్లో ఉండే బౌమాన్-బిర్క్, కునిట్జ్ ఇన్హిబిటర్లు పలు జీవసంబంధమైన విధులు నిర్వహిస్తాయని తెలిపారు. అవి మొక్కలను వ్యాధికారకాలు, తెగుళ్ల నుంచి రక్షిస్తాయని చెప్పారు. పత్తి, పల్లి, వంకాయ, టమాట, క్యాప్సికం, ఆముదం తదితర పంటలకు సోకే లెపిడోప్టెరన్, హెలికోవర్పా వంటి తెగుళ్ల నుంచి కాపాడుతాయని వివరించారు.

### ఐజీయూ పురస్కారం



- జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ (ఎన్‌జీఆర్ఐ) సీనియర్ ప్రిన్సిపల్ శాస్త్రవేత్త డాక్టర్ లబానీ రే కు ప్రతిష్ఠాత్మక ఇండియన్ జియోఫిజికల్ యూనిట్ (ఐజీయూ)-అన్ని తల్వానీ స్మారక పురస్కారం లభించింది. భూమి లోపల జియోథర్మల్‌పై ఆమె చేసిన విశేష కృషికి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. రాళ్ల ఉష్ణ వాహకతను కొలవడానికి ఎన్‌జీఆర్ఐలో ప్రత్యేకంగా పరిశోధన శాల ఏర్పాటు చేశారు.

### 'అభినవ మొల్ల' మృతి

- అభినవ మొల్లగా ప్రఖ్యాతి చెందిన రచయిత్రి డాక్టర్ చక్రవర్తుల లక్ష్మీనరసమ్మ(85) డిసెంబర్ 7న అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె రచనలు పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. భద్రగిరి, సమతాభిరామం, శ్రీపదం, అక్షర తర్పణం, మారుతీ సుప్రభాతం, నీరాజనం, సమస్యా పురాణం, మధువని మొదలైన రచనలు ఆమెకు పేరుతెచ్చాయి. హరికథలు, నాటికలు, నాటకాలు, ఖండ వాక్యాలు, భక్తి గీతాలు, నానీలు, సంగీత రూపకాలు వంటి వాటిలో తనదైన శైలి చాటారు. ఆమె రచనలు కవయిత్రి మొల్ల శైలిలో ఉండటం వల్ల 'అభినవ మొల్ల' అనే బిరుదును కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి బహూకరించారు. లక్ష్మీనరసమ్మ సాహిత్యంపై ఇప్పటికే ఇద్దరు ఎంఫిల్ చేశారు. మరొకరు జీవిత చరిత్ర రాస్తున్నారు. ఈమె స్వస్థలం భద్రాచలం పట్టణం.



## జాతీయం

### సురక్షిత నగరం కోల్‌కతా

- దేశంలో సురక్షిత నగరంగా కోల్‌కతా వరుసగా మూడోసారి మొదటి స్థానంలో నిలిచింది. ఈమేరకు జాతీయ నేర గణాంకాల నమోదు సంస్థ (ఎన్‌సీఆర్‌బీ) నివేదిక వెల్లడించింది. 2022లో ప్రతి లక్ష జనాభాకు కనిష్ఠ సంఖ్యలో నేరాలు నమోదైన నగరాల్లో 86.5 కేసులతో కోల్‌కతా ప్రథమ స్థానం సాధించింది. తర్వాతి స్థానాల్లో పుణె (280.7), హైదరాబాద్ (299.2) నగరాలున్నాయి. 2021లో గుర్తించదగిన నేరాల సంఖ్య ప్రతి లక్ష జనాభాకు కోల్‌కతాలో 103.4, పుణెలో 256.8, హైదరాబాద్‌లో 259.9గా నమోదైంది. 20 లక్షలకు పైగా జనాభా ఉన్న 19 మెట్రోపాలిటన్ నగరాల్లోని సమాచారంతో ఎన్‌సీఆర్‌బీ ఈ ర్యాంకులను ప్రకటించింది. 'క్రైం ఇన్ ఇండియా 2022' పేరిట ఎన్‌సీఆర్‌బీ ఈ నివేదికను విడుదల చేసింది.



### తొలి మహిళా ఆర్మీ అధికారిగా గీతిక కౌల్

- సైన్యానికి చెందిన కెప్టెన్ గీతిక కౌల్ చరిత్ర సృష్టించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన యుద్ధభూమి సియాచిన్‌లో విధులు నిర్వర్తించనున్న తొలి మహిళా మెడికల్ ఆఫీసర్‌గా నిలిచారు. పూర్తిగా మంచుతో నిండి ఉండే సియాచిన్‌లో (సముద్ర మట్టానికి దాదాపు 15,500 అడుగుల ఎత్తులో) విపరీతమైన చలి ఉంటుంది. అలాంటి ప్రదేశంలో పనిచేయాలంటే శారీరకంగా, మానసికంగా చాలా దృఢంగా ఉండాలి. ఎంతో కఠోరమైన శిక్షణలో ఉత్తీర్ణత సాధించాలి. ఈ శిక్షణను గీతిక కౌల్ విజయవంతంగా పూర్తి చేశారు.



### యునెస్కో జాబితాలో గర్బా నృత్యం

- గుజరాత్ సంప్రదాయ నృత్యం గర్బాకు ఐక్యరాజ్యసమితి విద్య, శాస్త్రీయ సాంస్కృతిక సంస్థ (యునెస్కో) గుర్తింపు లభించింది. గర్బాను మానవత్వ సాంస్కృతిక వారసత్వ ప్రాతినిధ్య జాబితాలో చేర్చినట్లు గుజరాత్ సీఎం భూపేంద్ర పటేల్ ప్రకటించారు. భారత సంస్కృతిని ప్రపంచానికి చూపేందుకు ఇది గొప్ప అవకాశమని ప్రధాని మోదీ ఆనందం వ్యక్తం చేశారు.

### అగ్ని-1 విజయవంతం

- స్వల్పశ్రేణి బాలిస్టిక్ క్షిపణి అగ్ని-1ను శిక్షణలో భాగంగా ఒడిశా తీరంలోని ఏపీజే అబ్దుల్‌కలాం దీవి నుంచి భారత్ డిసెంబర్ 7న విజయవంతంగా ప్రయోగించింది. నిర్దేశిత పరిమితులన్నింటినీ అది కచ్చితత్వంతో అందుకున్నట్లు రక్షణ శాఖ అధికారులు వెల్లడించారు. చివరగా ఈ ఏడాది జూన్ 1న అగ్ని-1ను ఇదే దీవి నుంచి విజయవంతంగా పరీక్షించారు.

### నేరేడు జన్యుక్రమం ఆవిష్కరణ

- నేరేడు చెట్టుకు సంబంధించిన జన్యుక్రమాన్ని భారత శాస్త్రవేత్తలు ఆవిష్కరించారు. ఈ జాతి మొక్కల్లో కనిపించే ఔషధ గుణాల జన్యు, పరిణామక్రమ ప్రాతిపదికను అర్థం చేసుకోవడానికి పరిశోధన చేపట్టారు. భోపాల్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ పరిశోధకులు ఈ ఘనత సాధించారు. నేరేడు విత్తనం నుంచి సేకరించిన పదార్థాలకు మధుమేహాన్ని కట్టడి చేసే గుణం ఉందని ఐఐఎస్ఈఆర్ పరిశోధకుడు వినీత్ శర్మ తెలిపారు. కడుపు ఉబ్బరం, కీళ్లనొప్పి, గుండె సమస్యలు, ఉబ్బసం, మధుమేహం వంటి సమస్యలకు చికిత్సగా ఈ మందును ఆయుర్వేదంలో వినియోగిస్తారని వివరించారు. నేరేడు జన్యుపటంలో పెద్ద సంఖ్యలో కోడింగ్ జన్యువులు ఉన్నాయని తెలిపారు. దీని వల్ల కొన్ని జన్యువులు ఒకటి కంటే ఎక్కువ సంఖ్యలో ఉండటం వల్ల వినూత్న లక్షణాలు వచ్చాయని వారు వెల్లడించారు.



### 10వేల ఏండ్ల నాటి రాతి చిత్రాలు

- మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురం జిల్లాలో గల సత్‌పుడా పులుల అభయారణ్యంలో 10 వేల ఏండ్ల నాటి రాతి చిత్రాలను అటవీ అధికారులు గుర్తించారు. చుర్నా గ్రామ పరిధిలోని ఓ కొండపై ఈ రాతి చిత్రాలు వేల సంవత్సరాల కిందటి మనుషుల జీవన విధానాన్ని తెలిపేలా ఉన్నాయి. చేతుల్లో ఆయుధాలతో ఆదిమానవులు వేటకు వెళుతున్నట్లుగా ఉన్నాయి. అందులో జిరాఫీ లాంటి జంతువు, మరికొన్ని వన్యమృగాల చిత్రాలు కనిపిస్తున్నాయి. ఆహారం కోసం వేటాడుతున్న గిరిజనులు నృత్యాలు చేస్తూ వెళుతున్నట్లు వీటిని చిత్రించారు. పురావస్తు శిలల గొప్ప చిత్రాలు ఉన్న చుర్నా ప్రాంతం చారిత్రక ప్రదేశం. దీనికి ఎస్‌డీఆర్ పచ్‌మడీ, నర్మదాపురం ప్రాంతాలను కూడా కలిపితే దాదాపు 110 రాతి చిత్రాలు చూడవచ్చని చరిత్ర ఆచార్యులు డాక్టర్ హన్స వ్యాస్ తెలిపారు.



## అంతర్జాతీయం

### భూమిని చల్లబరిచే ఖనిజం గుర్తింపు

- గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ ఇప్పుడు ప్రపంచం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. అయితే దీనికి చెక్‌పెట్టే ఓ ఖనిజాన్ని అమెరికా పరిశోధకులు కనుగొన్నారు. సముద్రగర్భంలో ఉత్పత్తి అయ్యే స్మెక్టైట్ ఖనిజానికి భూమిని చల్లబరిచే శక్తి ఉన్నదని గుర్తించారు. ఇది గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్‌కు కారణమవుతున్న కార్బన్‌ను సంగ్రహించి నిల్వచేసుకొనే అద్భుతమైన సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని తేల్చారు. భూగ్రహాన్ని చల్లబర్చడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని కనుగొన్నారు.

### వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా 'రిజ్'

- రొమాంటిక్ అప్పీల్‌ను సూచించే 'రిజ్..' అనే పదం వర్డ్ ఆఫ్ ది ఇయర్‌గా 'ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్' (ఓయూపీ) ఎంపిక చేసింది. ఈ ఏడాది అత్యంత ప్రాచుర్యంలో నిలిచిన 8 పదాల్ని ఎంపిక చేసిన ఓయూపీ, అందులో ఫేవరెట్ పదంపై ఓటింగ్ నిర్వహించింది. నాలుగు రోజులపాటు జరిగిన ఈ ఓటింగ్‌లో బ్రిటిష్ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఫైనల్స్‌లో 'రిజ్' మొదటిస్థానంలో నిలిచింది. 2023 ఏడాదికి సంబంధించి మానసిక స్థితి, నైతికత, ఆందోళనను 'రిజ్..' ఉత్తమంగా ప్రతిబింబించిందని ఓయూపీ వెల్లడించింది.

### బీబీసీ చైర్మన్‌గా సమీర్ షా

- బ్రిటన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్ (బీబీసీ) చైర్మన్ పదవికి భారత్‌లో జన్మించిన డాక్టర్ సమీర్ షా (71)ను ప్రభుత్వం ఎంపిక చేసింది. జర్నలిజం, టీవీ కార్యక్రమాల నిర్మాణంలో 40 ఏళ్ల అనుభవం ఉన్న డాక్టర్ షా స్వతంత్ర టీవీ, రేడియో కార్యక్రమాల సంస్థ జూనిపర్ సీఈవోగా కూడా పనిచేశారు. గతంలో బీబీసీలో వివిధ హోదాల్లో ఆయన పనిచేశారు. బీబీసీ రాజకీయంగా స్వతంత్ర సంస్థ అయినా దాని చైర్మన్‌ను ప్రభుత్వమే నియమిస్తుంది. సమీర్ షా వంటి పాత్రికేయుడిని చైర్మన్‌గా నియమించడం ఇదే ప్రథమం. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్)లో 1952లో సమీర్ షా జన్మించారు.




### కీళ్లవాతం మందుతో మధుమేహానికి చెక్




- కీళ్లవాతానికి వాడే బారిసిటినిబ్ అనే మందుతో టైప్-1 మధుమేహాన్ని నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు వెల్లడించారు. శరీరంలో ఇన్సులిన్ ఉత్పత్తిని ఈ మందు సంరక్షిస్తుందని మెల్‌బోర్న్‌కు చెందిన సెయింట్ విన్సెంట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ మందు వాడటం ప్రారంభించిన 100 రోజుల్లో ఆశాజనక ఫలితాలు వచ్చాయని వెల్లడించారు.

## క్రీడలు

### డబ్ల్యూపీఎల్ అధ్యక్షుడిగా రోజర్

- మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) అభివృద్ధి కోసం బీసీసీఐ ఎనిమిది మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. బోర్డు అధ్యక్షుడు రోజర్ బిన్నీ ఈ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. బీసీసీఐ కార్యదర్శి జైషా కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తాడు. అరుణ్ ధూమల్ (ఐపీఎల్ చైర్మన్), రాజీవ్ శుక్లా (బీసీసీఐ ఉపాధ్యక్షుడు), ఆశిష్ శేలర్ (బీసీసీఐ కోశాధికారి), దేవ్‌జిత్ సైకియా (బీసీసీఐ సంయుక్త కార్యదర్శి), మధుమతి లెలె, ప్రభ్‌తేజ్ భాటియా ఈ కమిటీలో సభ్యులు.



### టీ20ల్లో బిష్ణోయ్ నంబర్ వన్



- భారత యువ లెగ్‌స్పిన్నర్ రవి బిష్ణోయ్ టీ20 క్రికెట్‌లో నంబర్ వన్ బౌలర్‌గా నిలిచాడు. ఐసీసీ తాజా ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సాధించాడు. ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు అందుకున్న బిష్ణోయ్ ఐదు స్థానాలు ఎగబాకాడు. అతడు ప్రస్తుతం 699 పాయింట్లతో మొదటి స్థానం కైవసం చేసుకోగా అఫ్గానిస్థాన్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ 692 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. శ్రీలంక స్పిన్నర్ వహిందు హసరంగ, ఇంగ్లండ్ బౌలర్ ఆదిల్ రషీద్ 679 పాయింట్లతో సంయుక్తంగా మూడో స్థానంలో నిలిచారు. టాప్-10 బౌలర్ల జాబితాలో భారత్ నుంచి బిష్ణోయ్ మాత్రమే ఉన్నాడు. బ్యాటర్ల జాబితాలో సూర్యకుమార్ యాదవ్ నంబర్‌వన్ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. టెస్టు, వన్డే, టీ20 టీమ్ ర్యాంకింగ్స్‌లో టీమిండియా అగ్రస్థానంలో కొనసాగుతుంది.